నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 20 మే 2024 | www.navatelangana.com


కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో



నవతెలంగాణ-రామాయంపేట

ప్రైవేటు స్థలంలో ఉన్న కూరగాయల మార్కెట్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కూరగాయల అమ్మకాలకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కూరగాయల వ్యాపారులు రాస్తారోకోకు దిగారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్లో వ్యాపారస్తులు విక్రయాలు నిలిపివేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు బజార్లో సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నామన్నారు. ప్రైవేటు స్థలంలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ ను, స్థలం యజమానులు ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని వ్యాపారస్తులు తెలిపారు. సరైన కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



నవతెలంగాణ-మద్దూరు

కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన. మండలంలోని లద్నూరు గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాగుల బాల్ నరసయ్య అనే గొర్రెల కాపరి తన వ్యవసాయ బావి వద్ద గొర్రెలను దొడ్డిలోకి తోలి, ఉదయం దొడ్డి వద్దకు వెళ్లేసరికి కుక్కల దాడిలో 10 గొర్రెలు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

ఎఫ్‌సెట్‌లో జిన్నారం విద్యార్థి సాయి కీర్తన ఉత్తమ ప్రతిభ



నవతెలంగాణ-జిన్నారం

ఇటీవల జరిగిన ఎఫ్‌సెట్‌లో అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో జిన్నారానికి చెందిన వి.సాయి కీర్తన ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు ఎంట్రన్స్ టెస్ట్‌లో 3340 ర్యాంక్ సాధించిన సాయి కీర్తనను తల్లిదండ్రులు ఆనంద్ శ్రీదేవితో పాటు పలువురు ప్రశంసించారు. తల్లిదండ్రుల చేయూత అధ్యాపకుల ప్రోత్సాహంతో తాను మంచి ర్యాంక్ సాధించినట్టు సాయి కీర్తన తెలిపారు. నీట్‌లో సైతం మంచి మార్కులు సాధించి వైద్య వృత్తికి రావాలన్నది తన ఆకాంక్ష అంటూ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రాబోయే నీట్ ఫలితాల్లో సైతం మంచి మార్కులు సాధిస్తానని ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

ధాన్యం తూకం త్వరగా చేయాలి



నవతెలంగాణ-రామాయంపేట

ధాన్యం తూకాలు త్వర త్వరగా పూర్తిచేయాలని రామంపేట తహశీల్దార్ రజని కొనుగోలు కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. మండల పరిధిలోని ప్రగతి ధర్మారం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ రజిని సందర్శించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యం నిల్వలను ఆమె పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం వెనువెంటనే తూకం వేయాలని లారీల ద్వారా రైస్ మిల్లుకు తరలించాలని అధికారులకు సూచించారు. అనంతరం రైస్ మిల్లులలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిలువలను ఆమె పరిశీలించారు. మిల్లర్లతో తహశీల్దార్ రజిని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని, హమాలీల కొరత లారీల కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఆమె వెంట ఆర్ఐ రాజుతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తే పీడియాక్ట్



సీపీ. డాక్టర్ బి. అనురాధ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్:

నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు, నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేయాలని చూసే వారిపై పీడియాక్ట్ అమలు చేస్తామని సీపీ. డాక్టర్ బి.అనురాధ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు, కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం జరుగుతుందని, తీరా అవి సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. నకిలీలలను అరికట్టడంలో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ బృందాలు రైతులను మోసం చేసే, నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అందుబాటులో పచ్చి రొట్ట విత్తనాలు



మండల వ్యవసాయ అధికారి గోవిందరాజులు

నవ తెలంగాణ-దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల కేంద్రంలో గల ఆగ్రోస్‌లో సబ్సిడీలో జనుము, జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గోవిందరాజులు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల రైతుల కోసం వర్షాకాలంలో వరి సాగు చూసి ముందు ఎరువు తయారి కోసం పచ్చి రొట్టె జిలుగు విత్తనాలను ప్రభుత్వం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి అన్నదాత జిలుగు రొట్టె విత్తనాలను వాడమూలంగా మంచి దిగుబడి వస్తుందన్నారు. నూటికి అరవై శాతం సబ్సిడీ పైన అందుబాటులో నలబై శాతం చెల్లించి విత్తనాలు పొందవచ్చన్నారు. జిలుగు 30 కిలోల సంచి 1116/- రూపాయలు రైతు చెల్లించి విత్తన బ్యాగ్ పొందాలన్నారు. అలాగే జనుము 40 కేజీ ల బ్యాగ్ 1448/- రూపాయలు చెల్లించి విత్తన బ్యాగ్ పొందాలని తెలిపారు. రైతులు తమ పరిదిలోని ఏఈఓను కలసి పట్టాదార్ పాస్ బుక్, లేదా ఆధార్ కార్డు చూపి పర్మిట్ పొందగలరు.

కాశీ విశ్వనాథుని సేవలో మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు



నవతెలంగాణ-దుబ్బాక

పురపాలిక కేంద్రంలోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలో (వైశాఖ శుద్ధ ఏకాదశి, ద్వాదశి) రెండ్రోజుల పాటు జరుగుతున్న శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి దంపతులు పాల్గొని కాశీ విశ్వనాథుని సేవలో తరించారు. ఆదివారం ఉదయం విఘ్నేశ్వర పూజ, నవగ్రహారాధన, అభిషేకం, అనంతరం శివపార్వతుల కల్యాణం అనంతరం రుద్రయాగం, అన్నపూజ, సాయంత్రం బండ్ల బోనాలు, వీరభద్రుని ఎదుర్కోలు, ఒళ్ళు బండ ప్రదక్షిణలు, రాత్రి అగ్నిగుండం అగ్ని ప్రతిష్ట, సోమవారం వేకువజామునుండే భద్రకాళి పూజలు, అగ్నిగుండ ప్రవేశం అనంతరం రథం ఊరేగింపు, సహస్రనామార్చనలు, శివ పూజలు, భజనలు వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సిద్ధిరాములు తెలిపారు.

ప్రతి విద్యార్థికి విద్య ఎంతో ప్రాముఖ్యం



నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి, అంజా గౌడ్‌లు అన్నారు. ఆదివారం అక్బర్పేట బొంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనము కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు 1999 సంవత్సరం సంబంధించిన వారు పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం చేపట్టారు. విద్య ప్రతి ఒక్కరికి మార్గదర్శమన్నారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రభాకర్, భాస్కర్, ప్రవీణ్, యాదగిరి, సుజాత, సరిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు వెన్నుముక

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి
- హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ఘోర వైఫల్యం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు వెన్నుముకని, కార్యకర్తల కృషితో మెదక్ పార్లమెంటు స్థానాన్నిభారీమెజారిటీతోకైవసం చేసుకోబోతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహి పాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు పట్టణ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి కృతజ్ఞతా సభ మరియు స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు బీఆర్ ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లోను పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయ కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేశారన్నారు. భారీ మెజారిటీతో విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు సిద్ధం కావాలని సూచించారు. గత పదేళ్లలో ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేసామని తెలిపారు. రాష్ట్రంలో ఏ నియోజక వర్గంలో చేయనన్ని పనులు పటాన్చెరు నియోజకవర్గంలో చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి ఓటు ను అడగాలని కోరారు. దొంగ హామీలు గుప్పించి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటి అమలులో ఘోరంగా విఫలమయిందని విమర్శించారు. రైతు రుణమాఫీ విష యంలో మీన మేషాలు లెక్కిస్తూ రైతులకు అన్యాయం చేస్తూందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరైన రూ.400 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలు పనికి రావన్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభా కర్, నాయకులు శంకర్ యాదవ్, తదితరులు ప్రసంగి ంచారు. ఈ సమావేశంలో ఎంపీపీలు దేవానందం, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మెన్ పాండురంగారెడ్డి, కార్పోరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సింధు ఆదర్శ రెడ్డి, పుష్ప నగేష్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సోమిరెడ్డి, దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతలో విఫలమైన ఎమ్మెస్ఎన్ కంపెనీ

- గాయపడ్డ కార్మికులను గాలికి వదిలేస్తున్నారు
- సిఐటియు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్



నవతెలంగాణ - రామాయంపేట

కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంలో ఎంఎస్ఎన్ కంపెనీ పూర్తిగా విఫలమైందని కామారెడ్డి జిల్లా సిఐటియు అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. గత కొన్ని రోజుల క్రితం కామారెడ్డి జిల్లా పెద్ద మల్లారెడ ఎంఎస్ఎన్ కంపెనీలో గాయపడ్డ, మండల పరిధిలోని ఝాన్సీ లింగాపూర్ వాసి సంజీవరెడ్డిని ఆయన పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంలో కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్లే తరచుగా కార్మికులు గాయాల పాలవుతున్నారన్నారు. గాయపడ్డ కార్మికునికి చికిత్స అందించడంలో కూడా కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. గాయపడ్డ కార్మికునికి పూర్తిగా నయం అయ్యేవరకు చికిత్స అందించాలని ఆయన డిమాండ్ చేశారు.గాయపడ్డ కార్మికుల కుటుంబాన్ని కంపెనీలు ఆదుకోవాలన్నారు. గాయపడ్డ కార్మికుడు చికిత్స పొందుతున్న సమయంలో పూర్తి వేతనం చెల్లించాలన్నారు.గాయపడ్డ కార్మికుడు కోలుకున్నాక తిరిగి, తనకు తగిన పని కల్పించాలన్నారు.కంపెనీలో పనిచేసే మిగతా 600 మంది కార్మికులకు ప్రమాదాలు జరగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 తప్పకుండా అందజేయాలని డిమాండ్ చేశారు.పిఎఫ్, ఈఎస్ఐ ప్రతి కార్మికునికి తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమని ఉన్నారు.

వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేకు సన్మానం



నవతెలంగాణ-గుమ్మడిదల

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షులు నక్క మంజుల వెంకటేష్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, అబిశెట్టి రాజశేఖర్‌తో పాటు ముఖ్య కార్యకర్తలు శాలువా, పూల మాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. బీఆర్ఎస్ చేసిన సంక్షేమ ఫలాలను ప్రజలకు గుర్తు చేయాలని సూచిం చారు. గుమ్మడిదల మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధికంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిపించుకోవడానికి శాయశక్తుల కృషి చేయాలన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మొహమ్మద్ హుస్సేన్, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

- అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర ఇంచార్జి భీమ్ రావ్



నవతెలంగాణ-రామాయంపేట

దళితులపై పెట్టిన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు వెంటనే ఎత్తివేయాలని ఇంటర్నేషనల్ అంబేద్కర్ సేవాసమితి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి భూంపల్లి భీమ్ రావ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆర్ వెంకటాపూర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ఈనెల 14న అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయగా, స్థానిక దళితులు రోడ్డుపై ధర్నా చేయడంతో, ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు అయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయకుండా, ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరుతో దళితులను అరెస్టు చేసి, భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదన్నారు. బేషరతుగా దళితులపై పెట్టిన కేసులన్నీ వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రజాసంఘాలన్ని ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. కేసులు ఎత్తివేయని పక్షంలో జిల్లా కలెక్టర్ కు, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. అప్పటికి స్పందించకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పుర రామస్వామి, బండారి కిషన్, కొలిమిగండ్ల రమేష్, నాగయ్య, బండారి ప్రభుదాస్, బాబు, భూపాల్, హరీష్, వినయ్, మల్లేశం, సందీప్, కృష్ణ, తిరుమయ్య, కుమార్, మల్లేశం తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ డబ్బులను వెంటనే చెల్లించాలి

- మార్కెట్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- పట్టు రైతుల సహకార సంఘం అధ్యక్షుడు ఐలయ్య



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పట్టు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాన్ని మార్కెట్లో పట్టు గూళ్లు అమ్మిన వెంటనే చెల్లించాలని, ఇన్సెంటివ్ బకాయిలు సైతం రైతుల ఖాతాల్లో జమ చేయాలని పట్టు రైతుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుగూళ్ల మార్కెట్లో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టుగూళ్ల విక్రయ కేంద్రంలో కనీస వసతులు లేవని, మార్కెట్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పట్టుగూళ్ళను మార్కెట్లో విక్రయించిన రోజే ఇన్సెంటివ్ రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. డిస్ఇన్ఫెక్షన్ మందులు, సున్నం, విజేత, బ్లీచింగ్ పౌడర్ వంటివి 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టు రైతుల సహకార సంఘం కోశాధికారి రాగుల రాజు, జిల్లా కమిటీ సభ్యులు పెద్దోళ్ల నర్సింలు, రేగుల దేవయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం నర్మెట శ్రీ సీతారాముల కళ్యాణం



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం నర్మెట గ్రామంలో శ్రీ సీతారామచంద్ర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారి కళ్యాణం రంగరంగ వైభవంగా జరిగింది. సీతారాముల కళ్యాణం అంతటా శ్రీరామనవమి రోజు నిర్వహిస్తారు. కానీ నర్మెట గ్రామంలో శ్రీరామనవమి రోజుతో పాటు విగ్రహ ప్రతిష్ట సందర్భంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండోసారి స్వామివారి కళ్యాణం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఆదివారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవము అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రాళ్ల బండి రమణాచారి ఇంటి నుంచి తలంబ్రాలను భాజా భజంత్రీలతో తీసుకొచ్చారు. అనంతరము తీర్థగోష్ఠి, అన్న సంతర్పణ నిత్య హవనము, నిత్యపూర్ణాహుతి, ఆరగింపు, తీర్థ ప్రసాదాల వితరణ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు.కళ్యాణోత్సవ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ రామాచారి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయిని రవీందర్ రెడ్డి, రామ్మోహన్ ,శేఖర్,రాజిరెడ్డి, ఇరుకుల లింగమూర్తి బాపురాజు, రాజేశం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

పోచమ్మ తల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రంలో ఈనెల 18 నుంచి ప్రారంభమైన ద్వితీయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ తల్లికి అభిషేకం నిర్వహించారు. ఇట్టి అభిషేకం కార్యక్రమానికి ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రత్యేకంగా హాజరై పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ లాంటి మహోత్సవాలు జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా కలిసికట్టుగా అమ్మవారికి అభిషేకం, బోనాల సమర్పణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమ న్నారు. గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని తల్లిని కోరుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మాచర్ల విజయ్ కుమార్, పుల్కల్ గ్రామ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, గ్రామాధ్యక్షులు లోకేష్, పీఏసీఎస్ డైరెక్టర్ మహేష్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు మఠం సిద్దయ్య, లస్కరి ఆంజనేయులు, రాజారాం, లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ సీజ్



నవతెలంగాణ-జహీరాబాద్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా సరిహద్దు దాటిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసినట్టు జహీరాబాద్ సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దామల మర్రి గ్రామం నుంచి పద్మజ రైస్ ట్రేడర్స్ యజమాని శ్రీనివాస్.. నిరుపేదలకు చెందాల్సిన సివిల్ సప్లయి బియ్యాన్ని అక్రమంగా గుజరాత్‌కు తరలిస్తున్నట్టు నమ్మదగిన సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జీజే10టీవీ9244 నెంబర్ గల లారీలో శ్రీనివాస్ బియ్యాన్ని తరలిస్తూ జహీరాబాద్ పట్టణంలోని ఆర్టిఏ చెక్పోస్ట్ వద్ద పట్టుబడినట్టు తహసీల్దార్ చెప్పారు. పట్టుబడిన లారీలో 280 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని.. వాటి విలువ అందాజా మూడు లక్షల 50 వేలు ఉంటుందన్నారు. దాంతో బియ్యాన్ని సీజ్ చేసి.. లారీ డ్రైవర్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన గిరిధర్ బాబు, పద్మజా రైస్ ట్రేడర్స్ యజమాని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. బియ్యాన్ని దిగ్వాల్ గ్రామంలో గల సివిల్ సప్లయి గోదాంలో భద్రపరిచామని.. చిరాకుపల్లి పోలీసులకు కేసును అప్పగించి విచారణ జరుపుతున్నట్టు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



నవతెలంగాణ-అక్కన్నపేట

హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల పరిధి కట్కూర్ జెడ్పీహెచ్ఎస్ 2001-2002 10వ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం కట్కూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడి చదువుకుంటున్న సువారు 70మంది పూర్వ విద్యార్థులు దాదాపు 20 ఏండ్ల తర్వాత.. తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని చిన్ననాటి బాల్యస్మృతులు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు హెడ్మాస్టర్‌గా ఉన్న వేణుగోపాల్‌తోపాటు ఉపాధ్యాయులు శాస్త్రి, యాదిరెడ్డి, సదాశివరెడ్డి, రాజశేఖర్, రాజు, ఉపాధ్యాయినులు శశికళ, ప్రభావతి, మాధవిలత, రజిత, ఆయేషాబేగం, తదితరులకు శాలువాలు కప్పి సన్మానించారు. గురువుల ఆశీస్సులు తీసుకునీ జ్ఞాపికలను అందజేశారు. అప్పట్లో జరిగిన సన్నివేశాలను గుర్తుచేస్తూ నేమరువేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు. పలకరింపులతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్దులు నేర్పి చనిపోయిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు రెండునిమిషాలు మౌనం పాటించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, సునిల్, రాజిరెడ్డి, రవికుమార్, యు రాజు, సుధాకర్, ప్రసాద్, ఎస్ రాజు, జె రాజు, ఏ ప్రవిణ్, సంపత్, ఎల్లస్వామి, తదితర మిత్ర బందం పాల్గొన్నారు.

ఆ ఓట్లు నాకే...
అంచనాలు వేసుకుంటున్న అభ్యర్థులు

నవతెలంగాణ - సిద్దిపేట

ఆ వర్గపు ఓట్లు మాకే... యువత ఓట్లు మాకు... రైతులు మాకే వేశారు... వ్యాపారులు ఈసారి మమ్మల్ని ఆదరించారు... ఆ ఓట్లు నాకే పడతాయి అని లోకసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13న జరిగిన లోకసభ ఎన్నికలకు సుమారు 30 రోజులు నుండి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని చేశారు. లోకసభ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గలలో అభ్యర్థులు పర్యటించి ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కులాలు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా వేరువేరుగా ఓటర్లను విభజించుకుని ప్రచారం చేశారు. ఎన్నికల అనంతరం ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరికి వారే ఆ ఓట్లు మాకే పడతాయనీ, తామే ఇంత మెజార్టీతో గెలుస్తున్నామని తమ తోటి వారితో చెప్పుకుంటూ ఆశలతో ఉన్నారు.

కాంగ్రెస్‌కు పడే అవకాశాలు....?

కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన నీలం మధు ముదిరాజ్ కులానికి చెందిన వ్యక్తి కాగా, ఉమ్మడి జిల్లాలోని ముదిరాజ్ కులస్తులు అందరూ తమకే ఓట్లు వేశారని అంచనాలు వేసుకుంటున్నారు. అంతేకాకుండా ముస్లిం మైనార్టీలు, ఎస్సీ వర్గానికి చెందిన ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు కూడా తమకు కలిసి వస్తుందని లెక్కలు వేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకానికి ఉచిత బిల్లు, రూ 500లకే గ్యాస్ సబ్సిడీ పథకాలు కూడా కలిసి వచ్చి ఓటర్లు తమ వైపే మొగ్గు చూపారని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంచనాలు వేస్తున్నారు. ఎవరు గెలుస్తారో చెప్పడంలో వేచి చూడాల్సిందే.

బీఆర్ఎస్‌కు పడే అవకాశం...?

మెదక్ లోకసభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలిచారు. కాబట్టి ఈ అసెంబ్లీ నియోజకవర్గలలో ఎమ్మెల్యేకు వచ్చిన ఓట్లు, తమ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వేస్తున్నారు. గత పది సంవత్సరాల తమ పాలనలో తీసుకువచ్చిన ప్రభుత్వ పథకాలు, పొందిన లబ్ధిదారులు, ముఖ్యంగా రైతుబంధు పథకం లబ్ధిదారులు, పింఛన్ పొందుతున్న వారి ఓట్లు తమకే పడతాయని లెక్కలు కడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కానందుకు ప్రజలు కోపముతో తమ పార్టీకే మద్దతుగా ఉన్నారని లెక్కలు కడుతున్నారు. కలెక్టర్ గా, ఇతర ప్రభుత్వ ఉద్యోగ హోదాలలో ఉమ్మడి జిల్లాలో పనిచేసిన సంబంధాలు కలిసి వస్తాయని అంచనాలు వేస్తున్నారు.

బీజేపీకి అవకాశాలు...?

బిజెపి పార్టీకి అయోధ్యలో రామ మందిర నిర్మాణము, రాముడు అక్షింతలు పంపిణీ ప్రజలలో ఒక సెంటిమెంటును తీసుకోవచ్చాయని, ఓట్ల రూపంలో తమకు పడే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వేస్తున్నారు. వ్యాపార వర్గాలు, యువత, కొత్తగా ఓటు హక్కు వచ్చినవారు కూడా బిజెపి పక్షాననే నిలిచారని అనుకుంటున్నారు. మోడీ ప్రభావం కూడా ఓట్ల రూపంలో కలిసి వస్తుందని అంచనాలు వేస్తున్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన సానుభూతి కూడా కలిసి వస్తుందని బిజెపి శ్రేణులు లెక్కలు కడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించడంలో, ఓటర్లను కలవడం కూడా కలిసి వస్తుందని బిజెపి నాయకులు చెబుతున్నారు. అభ్యర్థులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎవరి దిమాలో వారే గెలుస్తారని చెబుతున్నారు. కానీ జూన్ నాలుగు దాకా

వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

గత మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రైతులకు ఆపార నష్టం జరిగిందని.. నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షం, గాలి దుమారానికి తీవ్రంగా పంట నష్టం జరిగిందన్నారు. అనేక చోట్ల వరి ధాన్యం తడిసిందని.. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. పీఏసీఎస్, ఐకెపి ద్వారా వేగంగా కొనుగోలు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనేక చోట్ల మామిడి కాయలు రాలిపోయాయని.. ఇతర పంటలు నేలకొరిగాయన్నారు. రోడ్లపై వరద నీటితో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించి పోయిందన్నారు. కలెక్టర్, అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలు, వడగండ్ల వాసల దృష్ట్యా వెంటనే అధికారులు గ్రామాల్లో పర్యటించి, రైతులకు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు.

స్థానిక సమరానికి సిద్ధమవ్వాలి



నవతెలంగాణ-జిన్నారం

రాబోయే స్థానిక సంస్థల మహాసంగ్రామానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు పటాన్చెరువు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఆదవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు.. పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి గెలుపు కోసం విజయవంతంగా కృషి చేశారంటూ అభినందించారు. పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే జీఎంఆర్ అభినందించారని జిన్నారం బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనే అదే కృషి కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నాయికోటి రాజేష్, సోషల్ మీడియా అధ్యక్షులు భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకుల దృష్టి

నవతెలంగాణ-మనూర్

లోకసభ ఎన్నికల పర్వం ముగిసింది. ఫలితం కోసం ఎదురు చూస్తున్న ఈ తరుణంలో నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. జూన్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటన చేయడంతో ఎన్నికల వేడి మొదలైంది. టిక్కెట్ కోసం స్థానిక నాయకులు ఇప్పటికే ప్రయత్నాలు కూడా ప్రారంభించారు. మనూర్ మండల జెడ్పీటీసీ టికెట్ కోసం అధికార పార్టీలో నాయకులు ఎక్కువగా పోటీపడు తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.సంగారెడ్డి, కె.దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, యువ నాయకులు సిద్ధారెడ్డి, సంగన్న, న్యాయవాది దోసపల్లి దత్తు తదితరులు టిక్కెట్ కోసం పోటీలో ఉన్నారు. మరోపక్క సర్పంచ్, ఎంపీ టీసీగా పోటీ చేయడానికి యువతకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలపై పెద్దఎత్తున చర్చ నడుస్తున్నది. కొందరు ఏకంగా తామే అభ్యర్థులమంటూ సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.



సామాజిక సేవలో మెథడిస్ట్ చర్చికి ఎంతో ప్రాధాన్యత

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ప్రాంతంలో సామాజిక సేవ చేయడంలో మెథడిస్ట్ మిషనరీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చిలో జరుగుతున్న 94వ క్రైస్తవ ఉజ్జీవ సభలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు చర్చి ప్రాంగణంలో ఉన్న వ్యవస్థాపకులు రెవరెండ్ జీబి గార్డెన్, సతిమని ఎల్సి గార్డెన్‌ల విగ్రహాలకు పులమాల వేసి నివాళ్లర్పించారు. విద్యారంగంలో జహీరాబాద్ ఇంత అభివృద్ధి చెందడానికి క్రిస్టియన్ మిషన్‌రిలే కారణమన్నారు. మానవసేవయే మాధవ సేవగా భావించి తమ మృతదేహాలను, అవయవాలను సైతం విక్రయించి జహీరాబాద్‌లో విద్యాభివృద్ధికి గార్డెన్ దొర చేసిన కృషి మరువలేనిదన్నారు. విశ్వ మానవాళికి ఏసుక్రీస్తు బోధించిన జ్ఞానం, సూక్తులు అనుసరించ దగినవి అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, కమిటీ సభ్యులు షరీన్ జాన్, అనంత నవీన్ కుమార్, ఇజ్రాయిల్ బాబి, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ మక్సూద్ మోయిస్, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి కేంద్రంలోని ఆజాన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన మాజీ సర్పంచ్ నిమ్మల కిష్టయ్య కుమారుడి, కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డి.మాణిక్ ప్రభుగౌడ్, సూర్యప్రకాష్, శ్రీనివాస్,సతీష్ తదితరులు పాల్గొన్నారు .



అల్లీపూర్ జాతర పోటీల్లో రంజోల్‌కు ప్రథమ బహుమతి

నవతెలంగాణ-జహీరాబాద్

గత మూడ్రోజులుగా అల్లిపూర్‌లోని 96వ మెథడిస్ట్ జాతరలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో రంజోల్ గ్రామానికి మొదటి బహుమతి లభించింది. వివిధ పోటీల్లో సుమారు 30 గ్రామాలకు సంబంధించిన వారు పోటీ పడగా.. రంజోల్‌కు మొదటి బహుమతి, అల్గోల్ గ్రామానికి చెందిన బృందానికి రెండో బహుమతి లభించింది. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ బృందం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిందని ప్రముఖ న్యాయవాది నేతానియల్ అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులతో పాటు పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్స్‌లో శ్రీ అక్షయ కళాశాల విద్యార్థిని నిమ్మి జేమ్స్ ప్రతిభ

నవతెలంగాణ-సంగారెడ్డి

జేఈఈ మెయిన్స్ (బీఏఆర్సిహెచ్) 2024 ఫలితాల్లో ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 99.555 ఎన్‌టిఏ స్కోర్‌తో సంగారెడ్డి శ్రీ అక్షయ కళాశాలకు చెందిన విద్యార్థిని నిమ్మి జేమ్స్ 365 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం హర్షం వ్యక్తం చేశారు. నిమ్మి జేమ్స్‌ను కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరక్టర్లు భానుచందర్ రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్ జోషి , అధ్యాపక బృందం అభినందించారు.

వివాహ దినోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంత నవీన్ కుమార్ షలోమిల వివాహ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివాహ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మెథడిస్ట్ జాతర ఆవరణలో భక్తులకు అందరికీ మజ్జిగ పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సామాజిక సేవలో ముందుండే దంపతులు ఎల్లవేళలా నిరుపేదలకు అండగా నిలవడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చల పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంత నవీన్ కుమార్ సేన తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

- పేద, బలహీన అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు
- సుందరయ్య ఆశయబాటలో ముందుకు సాగుదాం
- సుందరయ్య వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు















నవతెలంగాణ-పటాన్‌చెరు

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని, పేద, బల హీన, అట్టడుగువర్గాల అభ్యున్నతికి, శ్రమదోపిడీ నుంచి కాపా డటానికి కృషి చేసిన మహనీయుడు సుందరయ్య అంటూ వక్తలు కొనియాడారు.

పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో ఆదివారం శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూని యన్ అధ్యక్షులు చుక్క రాములు హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య అజాత శత్రువని, నిరాడంబరుడని, ప్రజల మనిషి అని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు దిక్సూచి సుందరయ్య అని, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని, పార్లమెంట్లో మొదటి ప్రతిపక్ష నాయకునిగా సుందరయ్య ప్రజల సమస్యలపై గొంతెత్తి పోరాడిన తీరు, నిరాడంబరత ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. సుంద రయ్య ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి. పాండురంగా రెడ్డి, మనోహర్, ఎ.వీరారావు, నర్సింహులు, సిహెచ్.సంతోష్ కుమార్ కార్మికులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో సుందరయ్య చిత్రపటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య సీపీఐ(ఎం) పోరాటాల్లో ముఖ్య భూమిక పోషించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజా పోరాటా లను పార్టీ నిర్మాణంగా మల్చి ప్రజలను ముందుండి నడపడంలో సఫలీకృతుడయ్యాడన్నారు. ఆయ నకున్న యావదాస్తిని ప్రజలకు తృణపాయంగా పంచి కట్టుబట్టలతో వచ్చి కమ్యూనిస్టు పార్టీలో నాయకునిగా పేరొం దిన నేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడా రు. సుందరయ్య అంటే ఉద్యమం, సుందరయ్య అంటే పోరాటం, సుందరయ్య అంటే ఆదర్శప్రాయుడు, సుందరయ్య అం టే సీపీఐ(ఎం) నిర్మాణంలో ముఖ్యుడు అని అన్నారు. అందుకే నేటి యువతకు సుందరయ్య జీవితం ఆదర్శం కావా లన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయ కులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ, పెంట య్య, జార్జ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగారెడ్డి : సంగారెడ్డిలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు పాల్గొని మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ధనిక కుటుంబంలో పుట్టి నిరం తరం పేదల సంక్షేమం కోసం పరితపించిన నిరా డంబర నాయకుడు అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అను సరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరా టం చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని అన్నారు. భవిష్యత్లో సుందరయ్య స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వ హిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుమల్లేశం, ఏ.మానిక్, జి.సాయిలు, ఆఫీస్ కార్యదర్శి పి.కృష్ణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణంలోని అస్తబల్ వద్ద అరుణ పతాకం ఎగురవేసి సుందరయ్య చిత్రపటానికి సీపీఐ(ఎం) జిల్లా సభ్యురాలు మద్దూరి లక్ష్మి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యున్నత మానవీయతకు నిలువెత్తు రూపం సుందరయ్య అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన ఆచరణ, ఆలోచన ఒక పాఠం లాంటిదన్నారు. మళ్లీమళ్లీ ఆయనను స్మరించు కోవడం అంటే నేటి మన కర్తవ్యాన్ని మరింత చైతన్యంతో నిర్వహి ంచడమే అని అన్నారు. సుందరయ్య స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు,అశోక్, మద్దూరి బాలరాజ్, మహేష్, శివ కుమార్, నిజాంపురం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పోరాటాల యోధుడు సుందరయ్య అని కొనియాడారు. ప్రజలే ప్రాణంగా నేటి తరానికి ఆదర్శంగా నిలిచిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్ గౌడ్, మల్లేశం, ఎండి ఖయ్యూం తదితరులు ఉన్నారు.

పుల్కల్ : చౌటకూర్ మండలంలోని శివంపేట గ్రామ శివారులో గల సీబీఎల్ పరిశ్రమలో సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాగారెడ్డి హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పర్మనెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, కాంట్రాక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, కాంట్రాక్టు పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు రమేష్, సతీష్ మాట్లాడుతూ.. ధనిక కుటుంబంలో పుట్టినా నిరంతరం పేదల సంక్షేమానికి పరితపించిన నిరాడంబర నాయకుడు సుందరయ్య అని కొనియా డారు. అసెంబ్లీలో ప్రజా సమస్యల మీద కొట్లాడిన నాయకుడు అని గుర్తు చేశారు. భవిష్యత్‌లో సుందరయ్య స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమా లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మోషప్ప, శ్రీని వాస్, సంతోష్, అశోక్, ప్రవీణ్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

డా.కృష్ణమూర్తికి అరుదైన గౌరవం

అంతర్జాతీయ న్యూరో సదస్సులో ప్రసంగించేందుకు ఆహ్వానం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని హోప్ న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ న్యూరో సర్జన్ డా.కృష్ణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. ఐరోపా ఖండంలోని నెదర్లాండ్స్ రాజధాని అయిన ఆమ్స్టర్డామ్ నగరంలో ఈనెల 27 నుంచి 29 వరకు జరుగనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ న్యూరోసైన్స్ అండ్ బ్రెయిన్ డిజార్డర్స్' అనే అంతర్జాతీయ సదస్సులో 'గ్రామీణ ప్రాంతాల్లో ఆకస్మిక పరిస్థితులను అధిగమించడంలో అనుభవాలు, సింగిల్ స్పెషలిస్ట్ న్యూరో సర్జికల్ ప్రాక్టీస్‌లో న్యూరో సర్జన్‌గా నా దృక్పథం' అనే అంశం పైన ప్రసంగించేందుకు ఆయనకు ఆహ్వానం లభించింది. గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ వేదిక పై ప్రసంగించెందుకు వెళ్తున్న శుభ సందర్భంగా డా.కృష్ణమూర్తికి కుటుంబ సభ్యులు హాస్పిటల్ సిబ్బంది, స్నేహితులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా డాక్టర్ కృష్ణమూర్తి తల్లిదండ్రులు వ్యవ సాయదారులు, భార్య మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మెదక్ జిల్లా రేగోడు మండలం దోసపల్లికి చెందిన కృష్ణమూర్తి.. 5వ తరగతి వరకు జడ్పీహె చ్ఎస్ గజ్వాడలో, 6వ తరగతి నుండి ఇంట ర్మీడియట్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాల, కళాశాల హత్నూర, ఎంబీబీఎస్ ఎస్వీఎస్ మెడికల్ కాలేజ్, మహబూబ్నగర్, ఎమ్మెస్ ఇన్ జనరల్ సర్జరీ మమతా కాలేజ్ ఖమ్మంలో అభ్య సించారు. ఎంసిహెచ్ ఇన్ న్యూరో సర్జరీ, నిమ్స్ పంజగుట్ట, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ న్యూరో సర్జరీ గాంధీ మెడికల్ కాలేజీలో ఐదేండ్లు సేవలందించారు. పలు రాష్ట్ర,జాతీయ సదసులలో ప్రసంగించారు. పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. 4000లకు పైగా మెదడు, వెన్నెముక ఆపరేషన్స్ విజయవంతంగా నిర్వహించారు. వందలకొద్దీ ఉచిత మెడికల్ క్యాంపులు మారుమూల గ్రామాల్లో నిర్వ హించారు. అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వివిధ రోగాల పట్ల ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

వరి కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-పుల్కల్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి అక్కడ పడిగాపులు కాస్తున్నారని.. వారిని ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. పుల్కల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 25 రోజులు అవుతున్నా నేటికీ తూకం వేయట్లేదని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వలే దన్నారు. కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తగ్గించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. అంతేకాకుండా తూకం వేసిన ధాన్యానికి రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరతను సృష్టిస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సకాలంలో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీల కొలత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మాచర్ల విజయకుమార్, ఉపాధ్యక్షులు విష్ణయ్య, పుల్కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, పార్టీ గ్రామాధ్యక్షులు లోకేష్, సీనియర్‌నాయకులు సిద్దయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు.. అడ్డొస్తున్నాయని నరికేశారు

- 120 హరితహారం మొక్కలు నరికేసిన విద్యుత్ సిబ్బంది



నవతెలంగాణ-కొండాపూర్

నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్మాతకంగా చేపట్టి మొక్కలు విరివిగా నాటిన విషయం విధితమే. ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తున్నారు. అయితే నాడు నాటిన హరితహారం మొక్కలు నేడు విద్యుత్ వైర్లకు అడ్డుగా వస్తున్నాయని సిబ్బంది తొలగించారు. మల్లెపల్లి నుంచి గొల్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల పచ్చని పొలాల ముందు ఆహ్లాద కరమైన వాతవరణంలో నీడనిచ్చే చెట్లను



నరికివేయడం పై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ చూసుకోవడానికి లక్షలు వెచ్చిస్తుంది. సుమారుగా నాలుగేండ్లుగా ఆ మొక్కలు పెరిగేందుకు నిత్యం నీటి సరఫరా, ట్రీ గార్డుల ఏర్పాటు, ఎంతో శ్రమించి చెట్లను పెంచితే.. భాద్యతారాహిత్యంగా 120 చెట్లను కొట్టెయడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ సంఘటన పై విద్యుత్ శాఖ ఏఈని వివరణ అడగ్గా.. విద్యుత్ లైన్ల కిందనే చెట్లు పెంచడంతో.. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నదన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చెట్లను నరికివేసినట్టు చెప్పారు.

మెథడిస్ట్ జాతర ముగింపు ఉత్సవాల్లో నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరిగిన 94వ మెథడిస్ట్ జాతర ఆదివారం జెండా పండుగతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమం జిల్లా అధికారి జాన్ వెస్లీ, లెలీడర్ సరిన్ జాన్, రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముగింపు సమావేశంలో శేక్ మక్బుల్ దైవ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొని మాట్లాడుతూ.. 94 ఏండ్ల క్రితం జహీరాబాద్‌కు క్రైస్తవ మిషనరి రావడం జరిగిందన్నారు. ఇక్కడ ఉన్న ప్రజలను విద్యావంతులను చేస్తూ.. సమస్యలను తీర్చుతు ముందుకు వెళుతున్నదని.. వారి సదుద్దేశాన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. నాడు జహీరాబాద్‌లో పాఠశాలలు, వైద్యశాలలు ఏర్పాటుచేసి ప్రజలకు అక్షర జ్ఞానాన్ని కల్పించేందుకు వారు చేసిన కృషి ఎంతో అభినందనీయమన్నారు. నాటి పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు నేడు దేశ విదేశాల్లో ఎన్నో రంగాల్లో రాణిస్తున్నారని.. ఇది జహీరాబాద్ ప్రాంతానికే గర్వకారణంగా మారిందన్నారు. ఈ సంవత్సరం వారు చేస్తున్న ప్రతీ విషయంలో తాను సహకరిస్తాన న్నారు. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ లెలీడర్ ఇమానియల్, ఆర్ఓబి మెంబర్ మేరీ, డి.మాణిక్ ప్రభుగౌడ్, వివిధ పార్టీల నాయకులు, చర్చిల పాస్టర్‌లు పాల్గొన్నారు.

వాలంటీర్లు, స్కావెంజర్లను ముందుగానే నియమించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే పాఠశాలలకు స్కావెంజర్లను అలాగే ఉపాధ్యాయ కొరతను తీర్చడానికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి విద్యా వాలంటీర్లను యుద్ధ ప్రతిపాదించిన నియమించాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబెర్ అలీ, శ్రీనివాస రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఉపాధ్యాయుల కొరతను గుర్తించి ఆయా పాఠశాలలలో విద్యా వాలంటీర్లను నియమించాలన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి మీటింగ్‌లోనే విద్యా వాలంటీర్లను విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే నియమిస్తామని ప్రకటించినప్పటికీ.. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వెంటనే అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి పదోన్నతులు, బదిలీలు చేపట్టి తదనంతరం విద్యా వాలంటీర్లను నియమించాలని కోరారు. యూనిఫార్మ్, నోటు పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు ప్రారంభంలోనే విద్యార్థులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు హాఫీజ్ ,జీవన్ రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు

అకాల వర్షం.. చెరకు పంటలకు జీవం

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఉక్కపోత, ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఆదివారం కురిసిన వర్షం కాస్త ఉపశమనం కల్పించింది. మండలంలోని న్యాల్‌కల్, టేకుర్, గంగ్వార్ , రేజింతల్ ఆయా గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. దాంతో ఈ వర్షంతో చెరకు పంటకు ఎంతో మేలు జరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





జోగిపేట ఎస్ఎంఎ అధ్యక్షుడిగా గోవర్దన్‌రెడ్డి

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటకు చెందిన 1984-85 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్నేహ మంజీర కమిటీ (ఎస్ఎంఎ) సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో 2024-26 సంవత్సరానికి గాను నూతన కమిటీ ఎన్నికపై సభ్యులంతా ఏకగ్రీవంగా సీహెచ్. గోవర్దన్‌రెడ్డిని అధ్యక్షుడిగా ప్రతిపాదించి ఏకగ్రీ వంగా ఎన్నుకుని తీర్మానించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్లపాటు చేపట్టబోయే కార్యక్రమాలకు సభ్యులందరి సహకారం కావాలన్నారు. జోగిపేట ఉన్నత పాఠశాలలో ఉత్తమ విద్యార్థులకు నగదు, పేద విద్యార్థులకు ప్రోత్సాహంతో పాటు సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు తీర్మానించారు. ప్రతీ మూడు మాసాలకొకసారి సమావేశాన్ని నిర్వహించాలన్నారు. కార్యవర్గసభ్యుల ఎన్నిక భాద్యతలను అధ్యక్షుడికి అప్పగించారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షుడు మాణిక్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.రాంబాబు, సలహదారులు బోయిని వెంకటేశ్వర్, బి.అనీల్‌బాబు, మధుసూధన్‌రెడ్డి, కాల్వ ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, అశోక్, నాగరాజు గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనుమతి లేని విద్యా సంస్థలను సీజ్ చేయాలి



- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి

జిల్లాలో అనుమతి లేకుండా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్, విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశం తాడూరి భరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పర్మిషన్స్ లేకుండా నడుపుతున్నారని ఈ విద్యాసంస్థల్ని కట్టడి చేయాలన్నారు. పిల్లలకు అక్షరాలను నేర్పి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు విద్యాశాఖ అధికారులు స్పందించి ఆ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాడూరి విక్రమ్, ఢిల్లీ, యోగి, బన్నీ పాల్గొన్నారు

సహాయం కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి ధాన్యం పండిస్తున్న రైతులకు మామిడి రైతులకు నిరుపేదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పదో వార్డ్‌లో తన కుమార్తెతో కలిసి మంద సుశీల (88) పట్టణంలో చిన్న పెంకుటిల్లులో జీవనం సాగిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ పెంకుటిల్లు కాస్త శిథిలావస్థకు చేరింది. పెంకుటిల్లు ఎప్పుడూ కూలిపోతుందో అనే భయంతో బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తుంది. గతంలో రెండు పడకల గదికి దరఖాస్తు చేసుకున్నా తన పేరు లక్కీ డ్రాలో రాలేదని తీసివేశారు, అధికారులు పట్టణంలోని అన్ని వార్డులను పర్యవేక్షించి సరైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్‌ను మంజూరు చేయాలని కోరారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఆ వృద్ధురాలికి న్యాయం జరగాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం చేసి ఆదుకోవాలని ఆ వృద్ధురాలు ఎదురు చూస్తుంది.

ఏగొండ స్వామి కుటుంబానికి పరామర్శ



నవ తెలంగాణ-గజ్వేల్

డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి తల్లి దాసరి నల్ల పొశవ్వ మరణించిన విషయం తెలుసుకొని డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరవి వినయ్ కుమార్ గుంటూర్ నుంచి వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించి, నల్ల పొశవ్వ ఆత్మ శాంతించాలని కోరారు. సమాజ మార్పుకోసం అంబేద్కర్ మార్గంలో నడిచే కొడుకును సమాజానికి అందించినందుకు అమ్మకు వందనాలు తెలిపారు. సుధాకర్, మహేందర్‌లను ధైర్యంగా ఉండాలని తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవ్ పూర్ మండల పరిధిలోని బస్వాపూర్, వట్టిపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురి వృద్ధుల కుటుంబాలకు మండల రజక సంఘం నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం పలువురు రజక సంఘం నాయకులు ఆయా గ్రామాల్లో పర్యటించి బస్వాపూర్ గ్రామంలో మృతి చెందిన బస్వరాజు యాదగిరి కుటుంబానికి రూ.5000లు, వట్టిపల్లి గ్రామంలో మృతి చెందిన కొమ్మాట లక్ష్మీ కుటుంబానికి రూ.5000ల చొప్పున అందజేశారు. అనంతరం మండల రజక సంఘం ఉపాధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ అధ్వర్యంలో గత మూడు సంవత్సరాల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లోని రజక కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనందిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో రజకుల అభివృద్ధి కోసం వారిని ఐకమత్యం చేస్తూ గ్రామాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా చైతన్య పరుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రజక సంఘం నాయకులు రాచకొండ యాదగిరి, బాల్ నర్సయ్య, రాచమల్ల నర్సింలు, పాండు, కొమ్మాట సాయిబాబా, వడ్లకొండ దుర్గయ్య, బస్వరాజు యాదగిరి, చంద్రయ్య పాల్గొన్నారు.

బారసాల శుభకార్యంలో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

బారసాల శుభకార్యంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆదివారం మండలంలోని పెద్ద మాసన్ పల్లి గ్రామంలో పన్యాల దుర్గారెడ్డి మనవరాలు నామకరణ మహోత్సవంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అయనతో పాటు ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు అక్కం స్వామి, సీనియర్ నాయకులు యెన్నం భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కోసం డీడీలు కట్టిన కాపరులకు ప్రభుత్వం ఆదుకోవాలి



- మండల కురుమ సంఘం అధ్యక్షుడు గణేష్

నవతెలంగాణ-దౌల్తాబాద్

జీవన ఉపాధికై గొర్రెల కోసం డీడీలు కట్టిన గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల కురుమ సంఘ అధ్యక్షులు కురుమ గణేష్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రెండో విడతలో గొర్రె కాపరులను మండల వ్యాప్తంగా 278 ఒకడికి 43738 చొప్పున రూ.1,21,59 ,164లను రైతులు డీడీలు చెల్లించినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం కేవలం 36 మంది రైతులకు గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. డీడీలు చెల్లించి 11 నెలలు పూర్తయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అన్నదాతలు వారి వారి భార్యలకు సంబంధించిన బంగారు ఆభరణాలను అమ్మి డీడీలు చెల్లించినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ప్రచారంలో గొల్ల కురుమలు చెల్లించిన డిడిలకు ప్రతి ఒక్కరికి అందిస్తామని వాగ్దానం చేసిన రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో ప్రయాణించడం బాధాకరమన్నారు. డీడీలు చెల్లించిన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం వెంటనే గొర్రెలైనా లేదా వారు చెల్లించిన రూపాయలను తిరిగి ఇవ్వాలన్నారు. లేని పక్షంలో త్వరలో అసెంబ్లీని ముట్టడి చేస్తామని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

ధర్మ సామాజ్ పార్టీ తొగుట మండల కమిటి ఎన్నిక



నవతెలంగాణ-తొగుట

ఓటింగ్ పద్ధతి ప్రకారం ధర్మ సామాజ్ పార్టీ మండల కమిటి ఎంపిక చేశామని జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆ దేశాల మేరకు ప్రజాస్వామికంగా ఓటింగ్ పద్దతిలో ధర్మ సమాజ్ పార్టీ నూతన మండల కమిటీని ఎన్నిక చేశామని చెప్పారు. ఈ కమిటీ ఏర్పాటుకు సహకరించిన బాధ్యులకు నూతనంగా ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షులు యసరేణి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి మొత్కురి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు మాదరం మల్లేశం, కోశాధికారి నరేష్, కార్యదర్శిలుగా మాదరం లింగం, కాడిగళ్ళ సాగర్, సోషల్ మీడియా ఇంచార్జ్ తిప్పరం రాజు, కార్యవర్గ సభ్యులు ఎర్రోళ్ళ కర్ణకర్, గంట రాజు, యాటెల్లి భిక్షపతి, బెజుగమ రమేష్, గంట యాదగిరి, బెజుగమ నాంపల్లి, కుమార్, ప్రసాద్ లతో మండల కమిటీన ఎంపిక చేశామన్నారు. తమపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధినాయకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్‌కు, జిల్లా నాయకత్వానికి నూతన మండల కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ఇంటింటికి, గడపగడపకు చేరేలా ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. పార్టీ ఆదేశాలను ఎప్పటి కప్పుడు పాటిస్తూ అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



నవతెలంగాణ-కొండపాక

ద్వి చక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన కుకునూరు పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపూర్ జిల్లాకు చెందిన ప్రతాప్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తన బంధువుల ఇంటికి వచ్చి హైదరాబాద్ తిరిగి వెళుతున్న క్రమంలో కుకునూరుపల్లి గ్రామం వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 మెడికల్ టెక్నీషియన్ మహేందర్ పైలట్ రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

మృతురాలి కుటుంబానికి అర్థికసాయం



నవతెలంగాణ-మర్కూక్

మండల పరిధిలోని ఇప్పల గూడెం గ్రామానికి చెందిన కత్తెరపాక లక్ష్మి (50) ఇటివల వడదెబ్బ తగిలి మృతి చెందింది. ఆదివారం వంటి మామిడి మార్కెట్ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్, భాదిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కూక్ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, చేబర్తి మాజీ సర్పంచ్ ఎర్రబాగు ఆశోక్, తదితరులున్నారు.

పట్టణంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట : పట్టణంలోని వివిధ వార్డులలో సోమవారం ఉదయం 7:30 గంటల నుండి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడిఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. ముర్షద్ గడ్డ, గణేష్ నగర్, విక్టరీ టాకీస్ చౌరస్తా, రైతు బజార్, పాత బస్టాండ్, రాజేంద్రనగర్, విఘ్నేశ్వర్ నగర్, మైత్రివనం, మహాశక్తి నగర్, ఆదర్శనగర్, కాకతీయ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ గృహ వినియోదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు తమకు సహకరించాలని కోరారు.

బురదమయంగా మారిన గజ్వేల్ రోడ్లు





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో రోడ్లన్నీ బురద మయంగా మారాయి. మున్సిపాలిటీలో సిసి రోడ్లు లేక బురదమయంగా మారింది. వర్షాలు కురుస్తుండడంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని లక్ష్మీ ప్రసన్న నగర్,. ధనలక్ష్మి కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఒక లక్ష్మీ ప్రసన్న నగర్‌లోనే రోడ్ల నిర్మాణానికి మరో మూడున్నర కోట్ల రూపాయలు అవసరమందని అధికారులు అంచనా వేశారు. వర్షాలు పడితే నడిచే పరిస్థితి ఉండదు. రోడ్లు చెరువు కుంటలుగా మారుతున్నాయి. ఒకటి రెండు ఇండ్లున్న చోట సీసీ రోడ్లు వేస్తున్నారు. ప్రస్తుతం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో సిసి రోడ్లకు రూ 23 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 20 వార్డులో స్థానిక కౌన్సిల్ సభ్యులు వార్డుల వారీగా నిధులను ప్రతిపాదించుకొని సీసీ రోడ్లు వేస్తున్నారు. తమకు నిధులు కేటాయించిన నిధులు పూర్తి చేయాలని ఒక ఇల్లు ఉన్న ప్రాంతంతో కూడా రూ.60 లక్షలు పెట్టి రోడ్డు వేస్తున్నారు. వంద ఇండ్లు ఉన్న చోట సీసీ రోడ్డు వేయడం లేదు. అధికారుల సూచన మేరకే నిధులు కేటాయిస్తున్నామని పాలకవర్గం అంటుంది. వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్న వార్డులను అధికారులు గుర్తించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపాలిటీలో అన్ని వార్డులలో ఇదే దుస్థితి ఉంది. రోడ్లు గుర్తించి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అండర్ డ్రైనేజ్ మూలంగా గతంలో వేసిన సిసి రోడ్లు కొంత దెబ్బతిన్నప్పటికీ వాటిని చాలా చోట్ల లక్షల రూపాయలు పెట్టి డబుల్ రోడ్డు వేశారు.. 2013 తరువాత సీసీ రోడ్లకు మోక్షం లభించింది. అధికారులు నిధులను ఎలా ఖర్చు పెట్టాలో ఎక్కడ రోడ్డు వేయాలో పెద్దగా ఆలోచన చేసినట్లు లేదు. రోడ్ల సమస్యలు గుర్తించి నిధులు మంజూరు చేశారు.15, 20 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ కాలనీలకు నిధులు కేటాయించలేదు. ఈ విషయంలో మున్సిపల్ పాలకవర్గం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.గజ్వేల్ నియోజకవర్గం లో వర్షం భారీగా కురుస్తుండడంతో మున్సిపల్ కేంద్రమైన గజ్వేల్లో చాలా రోడ్లు జలమయమయ్యాయి. ఇంటి నుండి బయట పడాలంటే వీలు కావడం లేదు.

రోడ్లపైకి వస్తున్న మురికి నీరు

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక రోడ్లు వర్షం నీరుతో నిండిపోయి కనిపిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు ఆ రోడ్డు గుండా వెళ్లడానికి వీలు కావడం లేదు. పాండవుల చెరువులోకి నీరు చేరుతుంది. కాలువల్లోని నీరు చెత్తాచెదారంతో రోడ్లపైకి వచ్చినా అధికారులు మాత్రం స్పందించడం లేదు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె మూలంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేద చెందుతున్నారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

అవసరమైన చోట రోడ్లు వేయాలి
సీపీఐ(ఎం) నాయకులు బండ్ల స్వామి

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజలు ఉన్నచోట రోడ్లు వేయాలి. ఒకటి, రెండు ఇండ్లు ఉన్న చోట లక్షలు పెట్టి రోడ్లు వేస్తున్నారు. ప్రజా ప్రయోజనాలు పాలకవర్గం గుర్తించడం లేదు. మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- బోనస్ రూ.500 వెంటనే అందజేయాలి
- లేని పక్షంలో రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం
- ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-మర్కూక్

రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన మర్కూక్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఆయన మర్కూక్ బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మర్కూక్ కర్ణాకర్ రెడ్డి, జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించారన్నారు. నేడు సిఎం రేవంత్ రెడ్డి మాట తప్పి సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రైతులు పండించిన తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో గౌరారం వద్ద వందలాది మంది రైతులతో రాజీవ్ రహదారిని దిగ్బంధం చేసి ప్రభుత్వం కళ్ళు తెరిపిస్తామన్నారు. మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల కనకయ్య, మాధవరెడ్డి, గోపాల్ రెడ్డి, బి.మల్లేశం, అజయ్ రెడ్డి, సతీష్ గౌడ్, అకుల అనిల్, రామకృష్ణ రెడ్డి, సుర్వి బాలనర్సయ్య, సుధాకర్ రెడ్డి, బాపు రెడ్డి, ఎంబారెడ్డి,లక్ష్మారెడ్డి, సంతోష్ రెడ్డి, మొర్సు కరుణాకర్ రెడ్డి తదితరులున్నారు.



నవతెలంగాణ-నంగునూరు



రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న ఆకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నంగునూరు మండలం ముంద్రాయి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్లకు బోనస్ ఇస్తామనే మాట మరిచి పోయిందని ఎద్దేవా చేశారు.అధికారంలోకి రాకముందు వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న రకానికి రూ.500 బోనస్ ఇస్తామనే మాటలు హాస్యాస్పదం ఉన్నాయన్నారు. జిల్లాలో అత్యధికంగా దొడ్డు రకం వరినే పండిస్తారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యారెంటీలను ఎగగొట్టేందుకే రైతులను నమ్మించి మోసం చేస్తుందని విమర్శించారు. అన్ని రకాల వడ్లకు బోనస్ అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-జగదేవపూర్

తక్షణమే రైతులకు బోనస్ రూ.500 చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జగదేవపూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం బీఆర్ఎస్ మండల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసపూరిత హామీలను ఇచ్చి అధికారం చేపట్టారని, వడ్లకు క్వింటాలుకు బోనస్ రూ.500 ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకు అమలు పరచలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి కష్టకాలంలో రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి, ప్రకృతి కారణంగా తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలి డిమాండ్ చేశారు. రైతుల కోసం, రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, బుద్ధ నాగరాజు, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ కనకయ్య, తాజా మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, తాజా మాజీ వార్డు సభ్యులు, మహేష్ కరుణాకర్, అలీమ్, గణేష్, కార్యకర్తలు భాస్కర్, మనోజ్, శ్రీనివాస్, బషీర్, ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత
- ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-మర్కూక్

కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన జుగురాజు విశాల్ సింగ్ గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున ఆదివారం బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబానికి మర్కూక్ బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మర్కూక్ కర్ణాకర్ రెడ్డి, జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ గడ్డం ప్రసాద్‌తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలోని 94,553 సభ్యత్వాలున్నాయని, ఇందులో ఇప్పటి వరకు 329 మంది పాముకాటు, రోడ్డు ప్రమాదం , విద్యుత్ షాక్‌తో,ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు పార్టీ సభ్యత్వం నుంచి రూ.2 లక్షలను అందజేశామన్నారు. మొత్తం ఇప్పటి వరకు రూ.6.68 కోట్లను అందజేశామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలు పట్టుకొమ్మలున్నారు, భారతదేశంలో కార్యకర్తల కుటుంబాలను ఆదుకునే పార్టీ ఏదైనా ఉందంటే అది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, రాబోయే రోజులు బీఆర్ఎస్ పార్టీదేనన్నారు.


విద్యతోనే సమాజంలో గౌరవం



నవతెలంగాణ-కొండపాక

ప్రతి వ్యక్తికి విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందని మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిసిన గండ్ల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం, గ్రామ ఉపాధ్యాయులు దుబ్బ రాములు గ్రామంలోని నూతన గ్రంథాలయంకు రూ.20వేల విలువగల పుస్తకాలు, రూ.10 వేల విలువ గల ర్యాకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా గ్రామ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. విద్య అనేది సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తుందని, సమాజంలో అనేక రుగ్మతలకు కారణం నిరక్షరాస్యత అని వీటిని రూపుమాపడానికి గ్రామ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు రాములు, మల్లయ్య, గంగాధర్ గ్రామ యువత గ్రామస్తులు పాల్గొన్నారు

పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-గజ్వేల్:

గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస శర్మ పంతులు మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శనివారం ప్రతీ ఇంటి మహిళలు బోనం తీసి, డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకున్నారన్నారు. శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, నిర్వహించారు. ముదిరాజులు పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారన్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని బోనాల నైవేద్యాన్ని సమర్పించారు. అదివారం ఉదయం పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘ పెద్దలు, పాల్గొన్నారు..

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వెంకటగిరిలో డాక్టర్ బి.అర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ధ్వంసం చేసి వారం రోజులు దాటుతున్నా నిందితులను ఎపి ప్రభుత్వం అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఎత్తైన విగ్రహాలు పెట్టి ప్రజల ఓట్లను దండుకుంటున్న ప్రభుత్వం ప్రజలు తమ ఆత్మ గౌరవ దిక్సూచి అయిన బాబాసాహెబ్ విగ్రహాలను ఏర్పాటు చేసుకుంటే వాటిని కాపాడలేని దద్దమ్మ ప్రభుత్వాలు పాలన చేయడం సిగ్గు చేటన్నారు. నిందితులను అరెస్టు చేయకపోతే తెలుగు రాష్ట్రాలలో ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.కిరణ్, కె.చందు, బి.శంకర్‌లు వున్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన దేవి రవీందర్



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని వెలికట్ట గ్రామానికి చెందిన జర్నలిస్టు పురుషోత్తం తండ్రి యాదగిరి గత కొద్ది రజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ వారి కుటుంబాన్ని పరమార్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అమ్ములు రమేష్, మల్లమారి రవీందర్ మాజీ ఎంపీటీసీ నరసింహులు, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మాట, చంద్రశేఖర్ గంపల రాజు, కుక్కల నవీన్, అయిలయ్య కనకయ్య తదితరులు పాల్గొన్నారు

22న దుబ్బ రాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నవ తెలంగాణ-దుబ్బాక

అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ పార్వతి సహిత దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22 వైశాఖ శుద్ధ చతుర్దశి నుంచి 25 వైశాఖ బహుళ పాడ్యమి వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తంగా నిర్వహించబడుతాయని ఆలయ వంశపారం పర్య ధర్మకర్త టీ.దుబ్బరాజం శర్మ ఆదివారం తెలిపారు. ఈ నెల 22న శత రుద్రాభిషేకం, 23న కల్యాణోత్సవం, చండీ హావనం, 24 న స్వామి వారి రథోత్సవం, పూర్ణాహుతి వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి సేవలో తరించాలని కోరారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం-2ను ఆదివారం మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా సీడ్స్ అండ్ పెర్టిలైజర్స్ షాప్స్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. పట్టణ ప్రాంతానికి వెల్లకుండా దూర ప్రయాస తగ్గుతుందని తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, సోసైటి చైర్మన్ కోల రమేశ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షుడు చౌడుచెర్ల జయపాల్ రెడ్డి, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కర్ణకంటి వేణు, తిరుపతి, పందిల్ల మోహన్ రెడ్డి, రంగారెడ్డి, నరేశ్.నర్సింలు, ప్రొప్రైటర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

లచ్చపేటలో అ'పూర్వ' సమ్మేళనం

నవ తెలంగాణ-దుబ్బాక



పాతికేళ్ల క్రితం ఒకే పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థిని విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనానికి ఆదివారం దుబ్బాక పురపాలిక పరిధి లచ్చపేటలోని ఓ ఫంక్షన్ హాల్ వేదికైంది. లచ్చపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1999 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులందరూ ఆత్మీయంగా కలుసుకున్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులకు ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో సిద్దిపేట ఎంఈవో సత్తు యాదవ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణ, జగదయ్య, మల్లికార్జున్ రెడ్డి, విద్యార్థులు బాలజ్యోతి, సుమలత, సౌమ్య కిరణ్, రాజేందర్, కిషన్, నరేష్, కృష్ణంరాజు, శ్రీశైలం, రవి, మహేష్, విజయ్, రాజు, పలువురు పాల్గొన్నారు.

పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన నేత సుందరయ్య

- **సీపీఐ(ఎం)పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



పీడిత ప్రజల విముక్తి కోసం నిరాడంబరంగా జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి నివాళులర్పించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా అట్టడుగు ఉన్నటువంటి పేద ప్రజలను సమస్యల నుండి విముక్తి చేయాలని, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. పోరాటాలతో పాటు సేవా కార్యక్రమాలతో ప్రజలకు సేవలందిచారని అన్నారు. తన యావదాస్తిని మొత్తం పేద ప్రజలకు పంచిపెట్టి ప్రజా ఉద్యమాలు ఊపిరిగా అత్యంత నిరాడంబరంగా జీవితం గడిపిన త్యాగదనుడని, పార్లమెంటుకు సైతం సైకిల్‌పై వెళ్లి సాధారణ జీవితాన్ని గడిపిన గొప్ప నాయకుడని అన్నారు. దేశంలో దోపిడీ పాలన అంతం కావాలని సమ సమాజం, కష్టజీవుల రాజ్యం రావాలని ఆ లక్ష్యం కోసం ఎన్ని ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా ఎత్తిన ఎర్రజెండాను దించకుండా ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనేత సుందరయ్య అన్నారు. సుందరయ్య గారి స్ఫూర్తితో నేటి యువత స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలని, పేద ప్రజల విముక్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో నేడు మత, కుల రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభజనలు తీసుకువస్తూ ప్రజల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని దేశాలౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా చట్టాల్లో మార్పు తీసుకొస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, ఈ పరిణామాలు లౌకిక దేశంగా ఉన్న ప్రజాస్వామ్యయుతమైన భారత దేశంలో ప్రజల మధ్య అశాంతి నెలకొల్పడానికి కారణం అవుతుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా సుందరయ్య గారి స్ఫూర్తితో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారానే పుచ్చలపల్లి సుందరయ్య గారికి నిజమైన నివాళులు అర్పించిన వారు అవుతారని తెలిపారు. సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి నవీన, జాలిగపు శిరీష, సిద్దిపేట రూరల్ మండల కార్యదర్శి మామిడాల కనకయ్య, నాయకులు కొండం సంజీవ్, వంగ రవీందర్ రెడ్డి బాలమణి, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

- **సీపీఐ(ఎం) పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం**

నవతెలంగాణ-మెదక్



కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనలో ముందుకెళ్లాలని సీపీఐ(ఎం) పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఉద్యమ నిర్మాతగా, సిపిఎం పార్టీ అఖిల భారత కార్యదర్శిగా, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచడంలో చాలా కీలక పాత్ర పోషించడన్నారు. పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకుడుగా ఉండి, దేశంలోని అనేక ప్రజా సమస్యలు లేవనెత్తినటువంటి గొప్ప వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని తెలిపారు. ప్రతిపక్ష నాయకులతో సహా, శత్రు వర్గాలు సైతం సుందరయ్యను కొనియాడెటువంటి పరిస్థితి ఉండేదన్నారు. ఆనాడు నెహ్రూ ఆయనను ప్రస్తావిస్తూ సుందరయ్యను తీసుకుపోయి సముద్రంలో పడేస్తే సముద్రంలోని చేపలను కమ్యూనిస్టులుగా మార్చేస్తాడని ప్రస్తావించిన పరిస్థితి ఉందన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ ఆయన యావదాస్తిని పేద ప్రజలకు పంచిపెట్టి, త్యాగం చేసి, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించి, పిల్లలను కనకుండా సమాజ సేవ చేశారన్నారు. పార్లమెంటుకు ఆ రోజుల్లో సైకిల్ మీద ప్రయాణం చేసినటువంటి ఘనత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఉందన్నారు. ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలే కాదు, ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించి, అనేక రకాలుగా ప్రజలకు అండగా నిలబడ్డ వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన ఆశయాలు ముందుకు తీసుకోవడం కోసం సిపిఎం పార్టీ దేశవ్యాప్తంగా కృషి చేస్తుందన్నారు. ఈనాటికి భూములు పంచాలని, కూలీ పెంచాలని, దోపిడి వ్యవస్థ కూలగొట్టాలని, సోషలిజం నిర్మించాలని సిపిఎం పార్టీ ప్రయత్నం చేస్తుందన్నారు. ఆయనకు అర్పించేటువంటి నిజమైన నివాళి ఈ దేశంలో వర్గ పోరాటాన్ని పెద్ద ఎత్తున పెంచడం, ఇవాళ దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా, కులోన్మాదానికి వ్యతిరేకంగా, ప్రాంతీయ తత్వానికి వ్యతిరేకంగా ఈరోజు ప్రజా ఉద్యమాలకు సిపిఎం పార్టీ అంకితమై పనిచేస్తుందన్నారు. నేటి తరాలు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని, ప్రజా జీవితాలకు అంకితం అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, గీత, నాయకులు మొయినుద్దీన్, దుర్గా, నాగమణి, షౌకత్, సత్యం, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయం



సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్, సందబోయిన ఎల్లయ్య, గోపాలస్వామి











నవతెలంగాణ-దుబ్బాక

అంటరానితనం, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి సమ సమాజ సమానత్వం కోసం తన ఇంటి నుండే సహపంక్తి భోజనాలు నిర్వహించి ప్రజలంతా సమానమేనని చాటి చెప్పిన గొప్ప నాయకుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన పోరాట జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్ అన్నారు. సుందర రామిరెడ్డి అన్న పేరులోంచి రెడ్డి పదాన్ని తొలగించుకొని సుందరయ్యగా నామకరణం చేసుకున్న గొప్ప సంఘసంస్కర్త ఆయన అని కొనియాడారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ. సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలోనూ పాల్గొన్న మహనీయుడని గుర్తు చేశారు. చట్టసభలకు సైకిల్ పైన వెళ్లి ప్రజా సమస్యలనే ఎజెండాగా తీసుకొని మాట్లాడే వారిని, నిరాడంబర జీవితానికి సుందరయ్య నిదర్శనమని కొనియాడారు. దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించి సమసమాజ నిర్మాణం కొరకు పని చేశారని కితాబిచ్చారు. సమాజాన్ని ఆర్థిక వ్యవస్థనూ లోతుగా అధ్యయనం చేసి సమాజ మార్పు కోసం జరిగే వర్గ పోరాటంలో కార్మిక వర్గాన్ని మిళితం చేసి నడిపిన గొప్ప నాయకుడని నొక్కి చెప్పారు. ఈరోజు దేశంలో అధికారంలో ఉన్న మతతత్వ బీజేపీ సర్కార్ కులాలు, మతాల మధ్య వైశ్యమ్యాలు సృష్టిస్తూ ప్రజల మధ్యలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. దేశ సంపదను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలందరూ కులాలు, మతాలకతీతంగా మతోన్మాద పార్టీలకు బుద్ధి చెప్పిన నాడే సుందరయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) దుబ్బాక పట్టణ నాయకులు కొంపల్లి భాస్కర్, లక్ష్మీనారాయణ, బత్తుల రాజు, మల్లేశం, మల్లికార్జున్, వెంకటస్వామి, లక్ష్మీనర్సయ్య, సాజిద్, అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

సీపీఐ (ఎం) పార్టీ మొట్టమొదటి ప్రధాన కార్యదర్శి, స్వతంత్ర సమరయోధుడు పార్లమెంటరీ మొదటి ప్రతిపక్ష పార్టీ నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శప్రాయమని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నిడారంబరతతో జీవితం గడిపిన ఆదర్శప్రాయుడన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు సుందరయ్య స్పూర్తితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. సుందరయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించారని, అనేక సహాయ కార్యక్రమాలు అంటరానితనం, శ్రమ దోపిడీ వ్యతిరేకంగా పనిచేయడం జరిగిందన్నారు. స్వతంత్ర పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లారని తెలిపారు. సైకిల్ మీద పార్లమెంటుకు వెళ్లి ప్రజా సమస్యలు నిలదీయడం జరిగిందని తెలిపారు. పిల్లలు ఉంటే స్వార్థం పెరుగుతుందని సుందరయ్య దంపతులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకొని తన యావదాస్తిని మొత్తం గ్రామ ప్రజలకు పంచి ఇవ్వడం జరిగింది అని తెలిపారు. తన పేరు సుందర రామిరెడ్డి అయినా కుల వివక్ష ఉండకూడదని పోరాటం చేసి తన పేరులో ఉన్న రెడ్డి తొలగించి సుందరయ్యగా మార్చుకున్నాడన్నారు ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. బందరు కాలువ తీయించడం, నిత్యవసర సరుకుల ధరలు పెరిగినప్పుడు సరుకులు తీసుకుని వచ్చి గ్రామంలో అదే రేటుకు సరుకులు పంపిణీ చేయడం, వ్యాధులు ప్రబలినప్పుడు వైద్యం అందించడం, కరువు వచ్చినప్పుడు అంబలి కేంద్రాలు పెట్టి ఆకలి తీర్చడం జరిగిందని తెలిపారు. అనేక రకాల సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా నాయకులు రవి బండ్ల స్వామి కనకయ్య వెంకట చారి వెంకటేష్ ఐలయ్య నర్సింలు రాజు మల్లేష్ రమేష్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ రైతంగ సాయుధ పోరాట వీరుడు, స్వతంత్ర సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మిరుదొడ్డి, అక్బర్పేట భూమ్పల్లి మండలంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి మాట్లాడుతూ తెలుగు నాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖంగా కుల వ్యవస్థ నిర్మూలనకు పునాది వేసిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. పార్లమెంటులో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్ సభ్యుడిగా సుదీర్ఘంగా పనిచేసిన నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. కార్మిక కర్షక పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. కార్మికులకు పని తగిన వేతనం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నాయకులు అంజయ్య, ఎల్లయ్య, కుమ్మరి శ్రీనివాస్, నాగేందర్, కుమారస్వామి, కూతురు స్వామి తోటయ్య గణేష్ ఈదరి క్రాంతి,, నాగరాజు సుదర్శన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శం, ఆచరణీయం, స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజులు అన్నారు. పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా చేర్యాల పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో సుందరయ్య అగ్ర భాగాన నిలిచారని తెలిపారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య తన వాటాగా వచ్చిన వందలాది ఎకరాల వ్యవసాయ భూమిని పేద ప్రజలకు పంచిన ఘనత సుందరయ్యకేదక్కిందన్నారు. శాసన, రాజ్యసభ సభ్యుడిగా పనిచేసినా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నిరాడంబర జీవితాన్ని గడిపారని అన్నారు. సాదాసీదాగా జీవితాన్ని గడిపిన సుందరయ్య ఎంతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారన్నారు. సమగ్ర భూ పంపిణీ పై, నీటి పారుదల రంగంపై అనేక పుస్తకాలు రాశారని నేటికీ అవి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రాంతంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని నాయకత్వం వహించి ఈ ప్రాంత ప్రజలను దొరలు, భూస్వాములు, రజాకార్ల దోపిడి నుండి తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేశారన్నారు. 1934వ సంవత్సరంలో తన సొంత గ్రామమైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కొవ్వూరు తాలూకా అలగాని పాడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి వ్యవసాయ కూలీల హక్కుల కోసం అలు పెరుగని పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి సిపిఎం పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్ కుమార్, నాయకులు పోలోజు శ్రీహరి, ఆముదాల నర్సిరెడ్డి, రాళ్లబండి భాస్కర్, రమ, లావణ్య, లక్ష్మీ, నూర్జీ, బోయిని మల్లేశం, ఎర్రబోస్ అశోక్, గొర్రె శ్రీనివాస్, ముస్త్యాల కుమార్, కొంగరి శ్రీదర్, ఇప్పకాయల రాములు, రాళ్లబండి నాగభూషణం, మేర్గోజు రాంచంద్రం, మంచాల నారాయణ, తొడంగల రామచంద్రం, కాటం రాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొమురవెల్లి

నేటి సమాజానికి పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని ఆయన స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం కామ్రేడ్ సుందరయ్య 39వ వర్ధంతి సభ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత వర్గంలో పుట్టిన సుందరయ్య అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేశారన్నారు. 1936 లోనే వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి రెక్కాడితే గాని డొక్కాడని అట్టడుగు వర్గాలైన దళితులు ఆదివాసి గిరిజనులు వృత్తిదారుల హక్కుల కోసం పోరాటాలు చేస్తూ దున్నేవాడికి భూమి కావాలనే నినాదంతో పోరాటాలు చేశారన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా అతి సాధారణంగా సైకిల్ పై పార్లమెంటుకు వెళ్లిన మహనేత అని అన్నారు పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నేతగా ఉండి దేశంలో భూ నది జలాల సమస్యపై ప్రభుత్వ రంగాల అభివృద్ధి లాంటి అనేక సమస్యలపై పార్లమెంటులో చర్చించి వాటి అమలు కోసం ఉద్యమాన్ని నిర్మించి అమలు చేసే దాంట్లో కీలక పాత్ర పోషించారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటు పరం చేస్తూ కులాల మధ్య మతాల మధ్య వైశాల్యాలు రెచ్చగొడుతూ లబ్ధి పొందాలని చూస్తున్నారని వీటికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. దేశంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద, రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరు రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, మండల నాయకులు సార్ల యాదయ్య దాసరి బాలస్వామి ఆరుట్ల రవీందర్ దాసరి చక్రపాణి తాడూరి భరత్ జ్యోతి సార్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు

కమ్యూనిస్టు పార్టీ నిర్మాత కామ్రేడ్ సుందరయ్య

కమ్యూనిస్టు పార్టీ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి అన్నారు. ఆదివారం మద్రి ముచ్చాలలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి, 39 వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, పార్టీ శాఖ కార్యదర్శులు బోడగం సురేందర్ రెడ్డి, పాసికంటి బాలరాజు, నాయకులు రాంరెడ్డి, చుంచు దేవకుమార్, అల్లం యాదయ్య, విగ్నేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పోరాడాలి

వ్యకాస జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో

నవతెలంగాణ-చేర్యాల

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దళితవాడలో జరిగిన కార్యక్రమంలో వెంకట మావో మాట్లాడుతూ సుందరయ్య పేదల ప్రజల కోసం దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి విముక్తి, అంటరానితనం, వివక్షత ఉండని కుల రహిత సమాజం ఏర్పడాలని కోరుకున్నాడని, మార్పు కోసం అనేక పోరాటాలు జరిపి విజయాలు సాధించాడని తెలిపారు. నేటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల శ్రమ దోపిడి జరుగుతుందని, వేల ఎకరాల భూములు కార్పొరేటు, బడా పెట్టుబడిదారుల వద్ద కేంద్రీకరించబడుతున్నాయని, కుల వివక్షత కొనసాగుతున్నదని, ఈ సమాజ మార్పు కోసం సమ సమాజ స్థాపన కోసం సుందరయ్య కలలు గన్న విప్లవ సాధన కోసం కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, పేద, దళితులు, మధ్యతరగతి ప్రజలంతా ఏకం కావాలని రాబోయే రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించే పోరాటాలలో ప్రజలంతా పాల్గొని మార్పు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్, గుండ్ర రవీందర్, కొమ్ము అశోక్, బ్రహ్మయ్య, ప్రసాద్, సిద్దయ్య తాడూరి పద్మ, కొమ్ము ప్రమీల, బుచ్చమ్మ, గూడెపు పద్మ, రేపాక లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.



శభాష్‌గూడెం గ్రామంలో జెండా ఆవిష్కరణ

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని శభాష్ గూడెం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మోకు దేవేందర్ రెడ్డి, నాగపురి కనకయ్య, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి గంధాల బాలు, నాయకులు దాసరి కనకయ్య, డి. రమేష్, బండ కింది సంపత్ కుమార్, ఉల్లంపల్లి మహేష్, మేర బోయిన రాజు, గొలుసుల సురేష్, బంక మల్లేశం, మేర బోయిన మహేష్, బొడ్డు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

నవ తెలంగాణ- దుబ్బాక



దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 13 వ వార్డు జగ్జీవన్ రామ్ కాలనీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జనతా ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరిగిందని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.భాస్కర్ తెలిపారు. తన జీవితాంతం సామాజిక అణిచివేత, కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనలో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని భాస్కర్ స్పష్టం చేశారు. ఈ శిబిరంలో జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు చెక్కపల్లి రాజమల్లు, ఉపాధ్యక్షుడు దొమ్మాట జోగయ్య, క్యాషియర్ ఇస్తారిగల్ల యాదగిరి, ఇస్తారిగల్ల ఎల్లం, బెల్లె బాల్ నర్సు, సీపీఐఎం నాయకులు కొంపల్లి భాస్కర్, లక్ష్మీనారాయణ, బత్తుల రాజు, మల్లేశం, పలువురు పాల్గొన్నారు.